


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | ఆదివారం | 20-09-2026 | సంపుటి: 3 | సంచిక: 227 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 20-09-2026 | VOLUME : 3 | ISSUE : 227 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## ఇక ప్రజాక్షేత్రంలోనే పరీక్ష

- బీఆర్ఎస్‌కు ఖైరతాబాద్ ఉప ఎన్నిక సవాల్
- కోర్టులో గెలిచినా ఎన్నికల్లో నిలబడాల్సిన పరిస్థితి
- ఓడితే కేడర్‌లో నైరాశ్యం పెరిగే అవకాశం
- అధికార కాంగ్రెస్‌కు ఉప ఎన్నిక విజయం బూస్ట్
- హైకోర్టు తీర్పు రాజకీయ ప్రభావం ఎన్నికల ఫలితంపైనే

3



## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్



- హైకోర్టు అనర్హత తీర్పుపై అప్పీల్
- ఉత్తర్వుల అమలుపై స్టే కోరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో అనర్హత వేటు
- ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించిన హైకోర్టు
- తీర్పుతో ఉప ఎన్నికకు తెరలేచిన పరిస్థితి

3

## కొత్త గేట్‌వేగా మామునూరు

- విమానాశ్రయానికి పేరు సూచించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- మూడు ప్యాకేజీలుగా నిర్మాణ పనులు చేపట్టేందుకు ఏఏఐ నిర్ణయం
- ఇప్పటికే రెండు ప్యాకేజీలకు టెండర్ల ప్రక్రియ పూర్తి
- భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయింపు
- పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలకు కొత్త అవకాశాలు
- పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి

2



3

## మరిన్ని ఆకర్షణీయమైన రంగుల్లో యూనిఫాం



# 440 ఎకరాల లెక్కలేంటి?

- కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో 31 గ్రామాల్లో భూములున్నట్లు రేవంత్ వెల్లడి
- కేసీఆర్ దంపతుల పేరిట 67.13 ఎకరాలు ఉన్నట్లు అసెంబ్లీలో ప్రస్తావన
- కేటీఆర్ కుటుంబ సభ్యుల పేరిట 123.19 ఎకరాలు ఉన్నట్లు సీఎం ప్రకటన
- మొత్తం భూములపై సీలింగ్ చట్టం వర్తింపుపై రేవంత్ ప్రశ్నలు
- భూముల వివరాలు, కొనుగోళ్లపై బీఆర్ఎస్ నుంచి స్పష్టత కోరుతున్న కాంగ్రెస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కుటుంబ భూముల వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట రాష్ట్రంలోని 9 జిల్లాలు, 24 మండలాలు, 31 గ్రామాల్లో కలిపి సుమారు 440 ఎకరాల భూములు ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. సెప్టెంబర్ 16న 22ఏ భూముల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ వివరాలను ప్రస్తావించారు. అయితే ఇవి ముఖ్యమంత్రి అసెంబ్లీలో చేసిన ఆరోపణలు, అధికారిక రికార్డుల ఆధారంగా ప్రభుత్వం పేర్కొన్న

మిగతా 2వ పేజీలో..

## 50 మంది రైతులకు నోటీసులు

- 21న ఆధారాలతో రావాలని తహసీల్దార్ ఆదేశం
- ఎర్రవల్లిలో కేసీఆర్ ఫామ్‌హౌస్ భూముల సర్వే
- సర్వే నంబర్ 325 భూములపై తీవ్ర ఉత్కంఠ

2



## ఏపీకి నీళ్లు.. పాలమూరు రైతులకు కన్నీళ్లు

- ఎల్ నినో పేరుతో నీటి తరలింపు
- ఆరుగంటలు మాత్రమే విద్యుత్ సరఫరా
- లోవోల్టేజీ కారణంగా కాలిపోతున్న మోటార్లు
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఎందుకు చర్యలు తీసుకోరు?
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

**వనపర్తి, సెప్టెంబర్ 19 :** ఏపీకి వంద టీఎంసీల నీళ్లు.. పాలమూరు రైతులకు కన్నీళ్లేనా ప్రకృతి అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ పాలమూరు రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో..

## ధరణితో పేద రైతులకు తీవ్ర నష్టం

- భూ హక్కుల రికార్డుల్లో మార్పులతో రైతులకు ఇబ్బందులు
- పాత పత్రాలు లేక హక్కులు నిరూపించుకోలేని పరిస్థితి
- తరతరాలుగా సాగు చేస్తున్న కుటుంబాలకు సమస్యలు
- దేవాలయ భూముల కబ్జాలపైనా ఆరోపణలు
- ధరణి సమస్యల పరిష్కారానికి భూ భారతి వ్యవస్థ మల్కాజిగిరి ఎంపీ ఈటల

2





## 'క్యూర్' లో 21వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తి

- నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
- దాదాపు 9వేల మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- కలెక్టర్లతో రెవెన్యూ మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

2




## ఎల్‌నినో కాదు.. కాంగ్రెస్ వైఫల్యమే

- రాష్ట్రంలో మానవ నిర్మిత కరువు పరిస్థితులు
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ తప్పుడు గణాంకాలు చెప్పారని ఆరోపణ
- శ్రీశైలం నీటిపై లెక్కలు చెప్పాలని డిమాండ్
- నీళ్లు ఉన్నా కల్వకుర్తి మోటార్లు నడపడం లేదని విమర్శ
- రైతుల సమస్యలు పట్టించుకోకుండా రాజకీయాలకే ప్రాధాన్యం మాజీ మంత్రి హరీశ్‌రావు

2

## వికసిత్ భారత్ సాధనలో కీలక పాత్ర

- క్యూర్, ప్యూర్, రేర్ విధానంతో సమతుల్య అభివృద్ధి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3






3

## అక్టోబర్ 9న ఆర్టీసీ ఎన్నికలు

## 2047 లక్ష్యం.. యువతే కీలకం

- అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో యువత భాగస్వామ్యం అవసరం
- ఎఫ్‌టీఏలతో కొత్త మార్కెట్లు.. యువతకు ఉద్యోగ, కెరీర్ అవకాశాలు
- ఇప్పటివరకు 40 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
- బ్రిక్స్ భాగస్వామ్యంలో యువత, పారిశ్రామికవేత్తలు చురుగ్గా ఉండాలి

4



# 50 మంది రైతులకు నోటీసులు

**మర్కుక్, సెప్టెంబర్ 19 :**

మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిధిలోని భూములపై రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వే నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం రైతులకు అధికారికంగా నోటీసులు జారీ చేసింది. రెండు రోజుల నుంచి నాలుగు బృందాలుగా సర్వేయర్లు 388 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం మూడో రోజు శివర్ వెంకటాపూర్ శివారులో సర్వేయర్లు సర్వే నిర్వహించారు. అయితే ఈ సర్వేకు సంబంధించి తాజాగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయం నుంచి నోటీసు విడుదలైంది.ఈ సందర్భంగా ప్రభుత్వ భూములు మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామం సర్వే నం.325లో గల గైరాన్ ప్రభుత్వ భూమి,విస్తీర్ణం 388.05 గుంటలు సమగ్ర సర్వే నిర్వహించేందుకు సంబంధిత పట్టాదారులు, అనుభవదారులు 50 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి ప్రొసీడింగ్స్ నం.A1/516/2026,సర్వే, సరిహద్దుల చట్టం 1923 ప్రకారం మొత్తం 388.05 గుంటల భూమికి సమగ్ర సర్వే నిర్వహిస్తామని నోటీసులో పేర్కొన్నారు. సర్వే నం.325లో ఉన్న రైతులు తమ భూమికి సంబంధించి పహాణీలో ఉన్న పట్టాదారులు, అనుభవదారులు 21న తమ భూమి వద్ద తగిన ఆధారాలతో తప్పనిసరిగా హాజరై తమ హద్దులను సర్వే అధికారులకు తెలపాలని తహసీల్దార్ ఆ నోటీసులో స్పష్టం చేశారు. ఈ నోటీసులతో ఎర్రవల్లిలో సర్వే మరింత ముమ్మరం కానుంది.

# 440 ఎకరాల లెక్కలేంటి?

**మొదటిపేజీ తరువాయి**

లెక్కలుగా చూడాలి భూములపై అక్రమత తుది విచారణలోనే తేలాల్సి ఉంటుంది.

**కేసీఆర్ కుటుంబం పేర్లపై ఎంత భూమి?**

రేవంత్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం కేసీఆర్, ఆయన భార్య శోభ పేరిట 67.13 ఎకరాలు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కేటీఆర్, ఆయన భార్య, పిల్లల పేరిట కలిపి 123.19 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. ఇందులో కేటీఆర్ పేరిట 49.5 ఎకరాలు, శైలిమ పేరిట 17.5 ఎకరాలు, అలేఖ్య పేరిట 9.38 ఎకరాలు, హిమాన్షు పేరిట 46.3 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే హరీశ్‌రావు కుటుంబ సభ్యుల పేరిట 30.16 ఎకరాలు, కవిత, ఆమె భర్త పేరిట 37.26 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌కుమార్ కుటుంబ సభ్యుల పేరిట 79.20 ఎకరాలు ఉన్నట్లు సీఎం వివరించారు. నవీన్‌కుమార్, కొండల్‌రావు కుటుంబ సభ్యుల పేరిట మరో 101.14 ఎకరాలు ఉన్నట్లు అసెంబ్లీలో వెల్లడించారు. ఈ వివరాలన్నింటినీ కలిపి కుటుంబానికి సంబంధించిన భూముల విస్తీర్ణం సుమారు 440 ఎకరాలుగా ప్రభుత్వం పేర్కొంటోంది.

**2004లో భూములు లేవు..**

**ఇప్పుడు వందల ఎకరాలు ఎలా?**

ఇదే అంశాన్ని కాంగ్రెస్ ప్రధాన రాజకీయ ప్రశ్నగా ముందుకు తీసుకొస్తోంది. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ పేరిట భూములు లేవని పేర్కొంటూ.. ఆ తర్వాతి కాలంలో కుటుంబ సభ్యుల పేరిట ఇంత పెద్ద మొత్తంలో భూములు ఎలా సమకూరాయనే ప్రశ్నను అధికార పక్షం లేవనెత్తుతోంది. అయితే భూములు ఉండటం మాత్రమే చట్టవిరుద్ధతకు ఆధారం కాదు. అవి ఎప్పుడు కొనుగోలు చేశారు? ఎవరి నుంచి కొనుగోలు చేశారు? కొనుగోళ్లకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? కుటుంబ సభ్యుల మధ్య బదలాయింపులు జరిగాయా? ఆదాయానికి అనుగుణంగానే ఆస్తులు సమకూరాయా? అనే అంశాలపై పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, ఆదాయపు పన్ను రికార్డులు పరిశీలించాల్సి ఉంటుంది.

**సీలింగ్ చట్టం చుట్టూ అసలు వివాదం**

భూముల విస్తీర్ణంతో పాటు వ్యవసాయ భూ సీలింగ్ చట్టాన్ని కూడా రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. భార్య, భర్త, అవివాహిత పిల్లలను ఒక యూనిట్‌గా పరిగణించే నిబంధనల ప్రకారం భూమి పరిమితులపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ముఖ్యంగా కేసీఆర్ కుటుంబం పేర్లపై ఉన్న భూములలో అధిక భాగం సీలింగ్ పరిమితిని మించిందని సీఎం వాదించారు.

అయితే ఇక్కడ భూముల స్వభావం, కుటుంబ యూనిట్ నిర్వచనం, భూముల వర్గీకరణ, ఆయా కాలాల్లో అమల్లో ఉన్న చట్టాలు వంటి అంశాలు కీలకం. అందువల్ల కేవలం మొత్తం ఎకరాల సంఖ్య ఆధారంగా భూములన్నీ చట్టవిరుద్ధమని నిర్ధారించలేం.

**ఫాంహౌస్ భూములపై మరో వివాదం**

440 ఎకరాల లెక్కలకు అదనంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ పరిసర భూములపై కూడా ప్రభుత్వం మరో ఆరోపణ చేసింది. ఫాంహౌస్ ప్రాంతంలో 295 ఎకరాల పట్టా భూములతో పాటు 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2017లో భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో ఈ భూములు రికార్డుల్లో మార్పులకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు. దీనిపై 30 రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఇక్కడ కూడా 440 ఎకరాల కుటుంబ భూముల లెక్కను, ఫాంహౌస్‌కు సంబంధించిన 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఆరోపణను వేర్వేరు అంశాలుగా చూడాల్సి ఉంటుంది.

**బీఆర్ఎస్ నుంచి ఏం సమాధానం వస్తుంది?**

ఇప్పటివరకు ఈ అంశంపై బీఆర్ఎస్ రాజకీయంగా ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తోంది. అయితే 440 ఎకరాల లెక్కలపై అసలు చర్చ భూముల యాజమాన్యం, కొనుగోలు తేదీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆదాయ వనరులు, సీలింగ్ నిబంధనలకు సంబంధించిన ఆధారాల చుట్టూనే తిరగనుంది. ప్రభుత్వం కూడా ఈ వ్యవహారాన్ని కేవలం రాజకీయ ఆరోపణల స్థాయిలో కాకుండా విచారణకు తీసుకెళ్తున్నట్లు ప్రకటించింది. ధరణి, 22ఏ భూములు, కుటుంబ సభ్యుల భూములపై వచ్చిన అంశాలను స్పెషల్ ఎంక్వైరీ టీమ్‌కు అప్పగిస్తున్నట్లు రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. అంతిమంగా 440 ఎకరాల వ్యవహారంలో అసలు ప్రశ్న భూములు ఎవరి పేర్లలో ఉన్నాయన్నదొక్కటే కాదు. అవి ఎలా సమకూరాయి, వాటి కొనుగోళ్లు చట్టబద్ధంగా జరిగాయా, సీలింగ్ నిబంధనలు ఉల్లంఘించారా, రికార్డుల్లో ఏమైనా అక్రమ మార్పులు జరిగాయా అన్నదే కీలకం. ప్రభుత్వం ప్రకటించిన విచారణలో వెలువడే పత్రాలు, ఆధారాల ఆధారంగానే ఈ ఆరోపణలకు పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఎల్‌నినో కాదు.. కాంగ్రెస్ వైఫల్యమే

- రాష్ట్రంలో మానవ నిర్మిత కరువు పరిస్థితులు
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ తప్పుడు గణాంకాలు చెప్పారని ఆరోపణ
- శ్రీశైలం నీటిపై లెక్కలు చెప్పాలని డిమాండ్
- నీళ్లు ఉన్నా కల్వకుర్తి మోటార్లు నడపడం లేదని విమర్శ
- రైతుల సమస్యలు పట్టించుకోకుండా రాజకీయాలకే ప్రాధాన్యం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 19:**

తెలంగాణలో నెలకొన్న నీటి కొరతకు ఎల్‌నినో పరిస్థితులు కారణం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శాసనసభలో సాగునీరు, ఎల్‌నినో పరిస్థితులపై జరిగిన చర్చను ప్రస్తావిస్తూ మీడియా సమావేశంలో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్‌తో కలిసి తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన బాధ్యతాయుతమైన నాయకుడిగా తాను చెప్పే అంశాలను ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

**శ్రీశైలం నీటిపై లెక్కలేంటి?**

కృష్ణా జలాల వినియోగంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో తప్పుడు గణాంకాలు చెప్పారని హరీశ్‌రావు విమర్శించారు. శ్రీశైలం నుంచి తెలంగాణ 80 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించిందన్న వాదనను ఆయన ఖండించారు. శ్రీశైలం నుంచి నీటిని ఎత్తిపోసేందుకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకమే మార్గమని, అక్కడ కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే ఎత్తినప్పుడు మిగతా నీరు ఎక్కడ వినియోగించారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

**నీళ్లు ఉన్నా తోడుకోలేదని ఆరోపణ**

కృష్ణా నదిలో తెలంగాణకు దక్కిన నీటి వాటాను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. శ్రీశైలంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ కల్వకుర్తి వద్ద ఐదు మోటార్లకు గాను రెండింటినే నడుపుతున్నారని అన్నారు. నీళ్లు ఉన్నా ఎత్తిపోసుకోలేని పరిస్థితికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. రైతుల పంటలకు నీరందించడంపై దృష్టి పెట్టకుండా సమస్యను ఎల్‌నినో, ప్రకృతి వైపరీత్యాలపై నెట్టివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

**రైతులను ఆదుకోవాలని డిమాండ్**

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇంత తక్కువ స్థాయిలో నీటి వినియోగం జరగడం ఇదే తొలిసారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రతిపక్షాలపై రాజకీయ విమర్శలు, కుట్రలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ఎండిపోతున్న పంటలు, ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే సాగునీటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ధరణితో పేద రైతులకు తీవ్ర నష్టం

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల పేద రైతులు తీవ్రంగా నష్టపోయారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎన్టీవీతో మాట్లాడుతూ.. ధరణి అమల్లోకి వచ్చిన సమయంలో భూ రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. అయితే ఆచరణలో అనేక మంది రైతులు భూ హక్కులు, రికార్డుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

**కాస్తు, అనుభవదారి వివరాలు తొలగించడంతో..**

ధరణి పోర్టల్‌లో భూమిపై హక్కుదారు, సాగుదారు వివరాలను తెలిపే 'కాస్తు', 'అనుభవదారి' కాలమ్‌స్‌ను తొలగించడంతో అసలైన సాగుదారులకు సమస్యలు ఏర్పడ్డాయని ఈటల అన్నారు. తరతరాలుగా ఒకే భూమిని సాగు చేస్తున్న పేద రైతుల వద్ద సేల్ డీడ్లు వంటి పత్రాలు లేకపోవడంతో తమ హక్కులను నిరూపించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. రికార్డుల్లో మార్పులు, పాత వివరాలు అందుబాటులో లేకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించారు.

**పత్రాలు లేక హక్కులు కాపాడుకోలేని పరిస్థితి**

గతంలో దొరల వద్ద పనిచేసి, వారి నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ఏళ్ల తరబడి సాగు చేస్తున్న కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఈటల తెలిపారు. సాగులో ఉన్న భూమిపై హక్కు ఉన్నప్పటికీ అందుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో వాటిని కాపాడుకోవడం కష్టంగా మారిందన్నారు. దేవాలయ భూముల విషయంలోనూ అక్రమాలు, కబ్జాలు జరిగాయని ఆరోపించారు.

**మంత్రిగా ఉన్నప్పుడే ఆందోళన**

ధరణి విధానం అమల్లోకి వచ్చిన సమయంలోనే దీని వల్ల ఎదురయ్యే సమస్యలపై తాను ఆందోళన వ్యక్తం చేశానని ఈటల రాజేందర్ తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే పేద రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని గుర్తించినట్లు చెప్పారు. భూమి పేద రైతులకు కేవలం ఆస్తి కాదని, తరతరాలుగా జీవనాధారంగా ఉందని పేర్కొన్నారు.

**భూ భారతి నేపథ్యంలో మళ్లీ చర్చ**

ధరణి స్థానంలో ప్రస్తుతం భూ భారతి వ్యవస్థ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో భూ సమస్యలు మరోసారి చర్చకు వచ్చాయి. ధరణి కారణంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఇప్పటికే వెల్లడించింది. ఈ నేపథ్యంలో పేద రైతుల భూ హక్కులు, పాత రెవెన్యూ రికార్డులు, సాగుదారుల వివరాలపై ఈటల చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:**

హైదరాబాద్ శివారు శంషాబాద్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పాలమాకుల వద్ద వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి కల్వర్ట్ ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు. మృతులను వ్యాపారవేత్త కేతావత్ లింబ్య (54), కేతావత్ జమున (45), కత్రావత్ మాన్సింగ్ (48), కేతావత్ వాస్రం (45)గా గుర్తించారు. వీరంతా తమ స్వగ్రామమైన మహబూబ్నగర్ జిల్లా నవాబ్ పేట మండలం మెట్టుగడ్డతండా నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణమని అనుమానిస్తున్నారు.

# 'క్యూర్' లో 21వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తి

- నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
- దాదాపు 9వేల మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- కలెక్టర్లతో రెవెన్యూ మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 :**

గత ప్రభుత్వం మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు పూర్తి చేస్తున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ ఇళ్లను తామెందుకు పూర్తి చేయాలన్న భేషజాలకు పోకుండా ఒక్క క్యూర్ పరిధిలోని 26 ప్రాంతాల్లో 21వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేశామని ప్రకటించారు. సచివాలయంలోని తన కార్యాలయం నుంచి రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, వాటర్‌వర్క్స్, విద్యుత్ అధికారులతో హౌసింగ్ సెక్రటరీ విపి గౌతమ్‌తో కలిసి మంత్రి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ఈనెల 30లోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి పారదర్శకంగా డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. 2బిహెచ్‌కే ఇళ్లు ఉన్న ప్రాంతానికి 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలో ఉన్నవారినే ఎంపిక చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటర్‌వర్క్స్, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని వచ్చే నెలాఖరులోగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉన్న అనర్హులను తొలగించాలని, ఆ ఇళ్లలో నివసించని వారికి ఫైనల్ నోటీస్ ఇచ్చి రద్దు చేయాలని, నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి వారి స్థానంలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు.



క్యూర్ పరిధిలో ఇంటి స్థలాలు ఉండి అర్హులైన దాదాపు తొమ్మిదివేల మందికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇన్‌ఛార్జి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక, మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులకు సూచించారు.

# కొత్త గేట్‌వేగా మామునూరు

**వరంగల్, సెప్టెంబర్ 19:**

వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన పనులు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతులు, భూసేకరణ, సాంకేతిక పరిశీలన వంటి ప్రక్రియలను పూర్తి చేసిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీలకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసింది.

**కొత్త గేట్‌వేగా మామునూరు**

మామునూరులో నిర్మించనున్న విమానాశ్రయానికి తగిన పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్ ప్రజల ప్రపంచ స్థాయి విమానాశ్రయ కల సాకారం కాబోతోందని ఆయన పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన వివరాలను ఎక్స్ వేదికగా వెల్లడించారు. భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఏఏఐకి అప్పగించినట్లు సీఎం తెలిపారు. ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యానికే పరిమితం కాకుండా పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వేగా మారుతుందని



పేర్కొన్నారు.

**పర్యావరణ అనుమతులపై దృష్టి**

మామునూరు విమానాశ్రయ పనుల పురోగతిపై రేవంత్ రెడ్డి ఇటీవల దిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. మిగిలిన ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి ఏఏఐ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. సంబంధిత పత్రాలతో ఏఏఐ ఇప్పటికే దరఖాస్తు సమర్పించినందున అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

# ఏపీకి నీళ్లు.. పాలమూరు రైతులకు కన్నీళ్లు

**మొదటిపేజీ తరువాయి**

వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఎల్నినో పేరుతో ఆంధ్రప్రదేశ్‌కు సాగునీటిని తరలిస్తున్నారని విమర్శించారు. ఏపీకి నీళ్లు వెళ్తున్నప్పుడు తెలంగాణకు ఎందుకు నీరు అందడం లేదని ప్రశ్నించారు.కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందడంతో శనివారం కేటీఆర్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పెబ్బేరు మండలంలోని గుమ్మడం, చెలిమిల విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించి లాగ్ రిజిస్టర్లను పరిశీలించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెబ్బేరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ వ్యవసాయానికి ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. లోఓల్టేజీ, తరచూ విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. వరదల సమయంలో నీటిని మళ్లించి చెక్‌డ్యామ్‌లు, చెరువులను నింపినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 7 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు పెంచామని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ మార్గాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు తరలిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. జూరాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహం లేదని అధికారులు చెబుతున్నారని, దీంతో కాలువలకు నీటి విడుదల నిలిచిపోయిందని తెలిపారు. అయితే మరోవైపు ఏపీకి నీరు వెళ్తుంటే తెలంగాణకు ఎందుకు నీరు అందడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను తరచూ ఆన్, ఆఫ్ చేయడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండదని, పంపులను ప్రారంభించిన తర్వాత నిరంతరాయంగా నడపాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం, జిల్లాలోనే రైతులు సాగునీరు, విద్యుత్ కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ ప్రాజెక్టుల విషయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఆలమట్టి ఎత్తు పెంపు అంశంపై కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, దీనివల్ల భవిష్యత్‌లో పాలమూరుకు నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో పాలమూరు ప్రాంతానికి రావాల్సిన వాటా దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి ప్రజాతీర్పు కోరాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న అధికార పక్షం వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్టోబర్ 9న ఆర్టీసీ ఎన్నికలు

- దశాబ్దం తర్వాత మోగిన ఎన్నికల నగారా
- కార్మికుల హక్కులను పునరుద్ధరించిన ప్రజాపాలన ప్రభుత్వం
- రవాణా శాఖ మంత్రి పొన్నం వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 : గత ప్రభుత్వ హయాంలో కాలరాసిన ఆర్టీసీ కార్మిక సంఘాల హక్కులను ప్రజాపాలన ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని, దాదాపు దశాబ్దం తర్వాత ఆర్టీసీలో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను అక్టోబర్ 9న నిర్వహించనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మిక సంఘాల చివరి గుర్తింపు ఎన్నికలు 2016 జులై 19న జరిగాయని గుర్తుచేశారు. రాష్ట్ర సాధనకు పోరాడిన ఆర్టీసీ కార్మిక సంఘాల హక్కులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడిందని తెలిపారు. కార్మిక సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా గుర్తింపు కల్పించే ఎన్నికలు జరగకుండా అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు.



**ప్రజాపాలనలో ఆర్టీసీకి పునరుజ్జీవం**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీకి సంబంధించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు వారి హక్కులను కూడా పునరుద్ధరిస్తున్నామన్నారు. తాజాగా కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రకటించారు. కార్మిక సోదరులందరూ స్వచ్ఛందంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిస్తున్నానన్నారు. గుర్తింపు సంఘాల ఎన్నికల అనంతరం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ప్రతినిధులను అధికారుల కమిటీలో భాగస్వాములను చేసి ఇతర రాష్ట్రాల్లో విలీనం అనంతరం ఎదురైన ఇబ్బందులు ఇక్కడ పునరావృతం కాకుండా సమగ్రంగా, కార్మికుల ప్రయోజనాలను కాపాడే విధంగా విలీనం ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని వివరించారు.. యూనియన్ గుర్తింపు ఎన్నికలు, విలీనం అంశాలపై కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చించి ముందుకు సాగాలనే దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. కాగా, ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆర్టీసీ కార్మిక లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

**కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు**

ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు డీఏలు చెల్లించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. 2017కు సంబంధించిన 21 శాతం, 2021కు సంబంధించిన 11 శాతం ఫిట్‌మెంట్ అందించామని, సీసీఎస్, పీఎఫ్ బకాయిల విడుదలతో పాటు నెలవారీ చెల్లింపుల ప్రక్రియ కొనసాగిస్తున్నామని, 1,432 కారుణ్య నియామకాలు పూర్తి చేశామని, గత ప్రభుత్వం సర్వీసు నుంచి తొలగించిన 250మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని, నాలుగు వేల ఉద్యోగాల నియామకాలకు అనుమతి ఇచ్చామని, డ్రైవర్, శ్రామిక్ పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి చేశామని ఆయన వివరించారు. 2,932 కొత్త బస్సుల కొనుగోలు చేపట్టామని, 600 బస్సులకు మహిళలను యజమానులుగా చేసే కార్యక్రమాన్ని చేపట్టామని, సంస్థ బలోపేతంతోపాటు కార్మికుల సంక్షేమానికి కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ కార్మికులు కేవలం ఉద్యోగులు కాదు.. ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముక.. వారి హక్కులను కాపాడటం, సంక్షేమాన్ని పరిరక్షించడం ప్రజాపాలన ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల భాగస్వామ్యంతో ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

- హైకోర్టు అనర్హత తీర్పుపై అప్పీల్
- ఉత్తర్వుల అమలుపై స్టే కోరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో అనర్హత వేటు
- ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించిన హైకోర్టు
- తీర్పుతో ఉప ఎన్నికకు తెరలేచిన పరిస్థితి

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పార్టీ ఫిరాయింపుల కేసులో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన అత్యున్నత న్యాయస్థానంలో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఉత్తర్వుల అమలుపై తక్షణమే స్టే విధించాలని కోరారు.

**2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి విజయం**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హత వేటు వేయాలని ప్రత్యర్థి పార్టీల నేతలు పిటిషన్లు దాఖలు చేశారు.

**సెప్టెంబర్ 18న తీర్పు**

ఈ పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న తీర్పు వెలువరించింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వచ్చేలా దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది.

**ఇప్పుడు సుప్రీంకోర్టులో న్యాయపోరాటం**

హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ కావడంతో ఉప ఎన్నికకు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పును రద్దు చేయడంతో పాటు దాని అమలుపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ అనంతరం వెలువరించే ఆదేశాలపై ఖైరతాబాద్ తదుపరి రాజకీయ పరిణామాలు ఆధారపడి ఉన్నాయి.

# ఇక ప్రజాక్షేత్రంలోనే పరీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయడంతో బీఆర్ఎస్ న్యాయపోరాటంలో విజయం సాధించింది. అయితే ఈ విజయాన్ని రాజకీయంగా నిలబెట్టుకోవాలంటే ఇక ప్రజాక్షేత్రంలోనే పరీక్ష ఎదుర్కోవాల్సి ఉంటుంది. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం కావడంతో.. ఆ సీటును తిరిగి దక్కించుకోవడం బీఆర్ఎస్‌కు కీలకంగా మారింది.

**కోర్టు తీర్పుతో ఉప ఎన్నికకు మార్గం**

బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్ చేసిన న్యాయపోరాటంలో హైకోర్టు.. ఫిరాయింపుల చట్టం కింద దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది. ఆయన శాసన సభ్యత్వం 2024 నుంచే రద్దయినట్లు తీర్పులో పేర్కొంది. తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించబోనని దానం నాగేందర్ స్పష్టం చేశారు. పార్టీ ఆదేశిస్తే ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. దీంతో ఇప్పుడు ఉప ఎన్నికపై రాజకీయ పార్టీల దృష్టి కేంద్రీకృతమైంది. న్యాయస్థానంలో సాధించిన విజయాన్ని ఓటర్ల తీర్పుగా మార్చుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై పడింది.

**ఓడితే కేడర్‌లో నైరాశ్యం**

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఓటమి పాలైతే ఆ ప్రభావం పార్టీ కేడర్‌పై పడే అవకాశం ఉంది. ఇప్పటికే వరుస రాజకీయ పరిణామాలను ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు మరో ఉప ఎన్నిక పరాజయం కార్యకర్తల్లో నిరుత్సాహానికి దారితీయవచ్చనే చర్చ జరుగుతోంది. కోర్టు ద్వారా అనర్హత వేటు సాధించినా.. అదే స్థానాన్ని తిరిగి గెలుచుకోలేకపోతే ఆ విజయాన్ని రాజకీయంగా నిలబెట్టుకోవడం కష్టమవుతుంది.

మరోవైపు కాంగ్రెస్ ఖైరతాబాద్‌లో విజయం సాధిస్తే అధికార పార్టీకి అది రాజకీయంగా మరింత ఊతమిచ్చే అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనర్హతతో ఏర్పడిన ఖాళీని తిరిగి కాంగ్రెస్ భర్తీ చేసుకుంటే.. ఆ ఫలితాన్ని తమకు



అనుకూలమైన రాజకీయ సంకేతంగా ఆ పార్టీ ప్రచారం చేసుకునే అవకాశం ఉంటుంది.

**ప్రజల తీర్పే కీలకం**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గ రాజకీయ సమీకరణాలు మారాయి. ఇప్పుడు అదే ప్రజలు ఉప ఎన్నికలో ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ఉప ఎన్నికలో గెలిస్తే హైకోర్టు తీర్పుతో పాటు ప్రజల తీర్పు కూడా తమకు అనుకూలంగా వచ్చిందని చెప్పుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం న్యాయపరంగా సాధించిన విజయానికి రాజకీయ ఫలితం దక్కనట్లవుతుంది. అందుకే దానం నాగేందర్‌పై అనర్హత వేటు తర్వాత బీఆర్ఎస్‌కు అసలు పరీక్ష కోర్టులో కాదు.. ఇక ప్రజాక్షేత్రంలోనే.

# మరిన్ని ఆకర్షణీయమైన రంగుల్లో యూనిఫాం

- వచ్చే ఏడాదికి ఇప్పటినుంచే ప్రణాళిక
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 : విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని అధికారులను ఆదేశించారు. యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జతను నెలాఖరులోగా అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున అందుకు తగిన ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని సీఎం అన్నారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓఝా, సైదులు, సంతోష్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ సాధనలో కీలక పాత్ర

- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక
- ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడుల సమీకరణ వైపు అడుగులు
- క్యూర్, ప్యూర్, రేర్ విధానంతో సమతుల్య అభివృద్ధి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 : వికసిత్ భారత్2047 లక్ష్యసాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో దిల్లీలో శనివారం జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో ఆయన ప్రసంగించారు. డిప్యూటీ సీఎంతోపాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. దేశం కనీవినీ ఎరుగని అభివృద్ధి సాధించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చు కుంటూనే ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం, ఉత్పాదకతను పెంచడం, అభివృద్ధి ఫలాలను ప్రతి పౌరుడికి, ప్రతి ప్రాంతానికి అందించడం ప్రధాన సవాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాక స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతున్నదని తెలిపారు.

**మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. 202526లో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందని చెప్పారు. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ.2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయన్నారు. ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే అంతకంటే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం రాష్ట్రానికే పరిమితమైనది కాదని, 2047 నాటికి సుసంపన్నమైన, స్వావలంబనతో కూడిన వికసిత్ భారత్ నిర్మాణానికి తెలంగాణ అందించే భాగస్వామ్యమని భట్టి పేర్కొన్నారు. సదస్సులో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు పాల్గొన్నారు.

**ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు ప్రాధాన్యం**

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మార్పు అవసరమని విక్రమార్క పేర్కొన్నారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులను సమీకరించి ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగించే నమూనా వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్క్‌ను తగ్గించడం, వయబిలిటీ గ్యాప్‌లను పూడ్చడం, ప్రైవేట్ పెట్టుబడులకు విశ్వాసం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇందుకోసం పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యాలు గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ వంటి మార్గాలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు.

**క్యూర్, ప్యూర్, రేర్‌తో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి**

అభివృద్ధి ఒకే నగరానికి పరిమితం కాకూడదని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాలు వెనుకబడకూడదన్న లక్ష్యంతో క్యూర్, ప్యూర్, రేర్ పేరుతో మూడు పరస్పర అనుసంధానిత ఆర్థిక ప్రాంతాలతో ప్రత్యేక అభివృద్ధి నమూనాను రూపొందించినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా క్యూర్(కోర్ అర్బన్ రీజియన్)ను అత్యున్నత సేవలు, కృత్రిమ మేధ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఫిన్‌టెక్, లైఫ్ సైన్సెస్, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాన రవాణా మార్గాల వెంట ప్యూర్(పెరి అర్బన్ రీజియన్)ను పారిశ్రామిక, తయారీ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు, రేర్(రూరల్ అగ్రికల్చరల్ అండ్ రిసోర్సు ఎకానమీ) ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తీసుకురానున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికత వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ల విస్తరణ, కోల్డ్ చైన్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా గ్రామీణ ఉత్పత్తిదారులను అధిక ఆదాయం అందించే దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించనున్నట్లు చెప్పారు.

**30 వేలకుపైగా ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ**

భవిష్యత్ నగరాలకు నమూనాగా 30 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు భట్టి తెలిపారు. దేశంలో తొలి నెట్‌జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ పరిశోధనా కేంద్రాలు, క్లీన్ టెక్నాలజీ పార్కులు, పర్యావరణహిత నివాస ప్రాంతాలు ఇందులో భాగంగా ఉంటాయని వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలను అనుసంధానించే కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో రీజినల్ రింగ్ రోడ్డు ప్రధానమైనదన్నారు.

**యువతే తెలంగాణకు అతిపెద్ద బలం**

మ□డు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మౌలిక వసతులు, పెట్టుబడులతోపాటు మానవ వనరులే అసలైన పునాది అని, యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక భద్రత, అందుబాటులో వైద్యం, నాణ్యమైన గృహ వసతి, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలకు మద్దతు ద్వారా అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నదే తమ విధానమన్నారు.



# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిస్థితులపై పర్యవేక్షించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 : రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సాయంత్రం బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీ (కమాండ్ కంట్రోల్ సెంటర్)కు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాలతోపాటు నగరంలో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రకు చేపట్టిన ఏర్పాట్లను కూడా అక్కడి నుంచి పరిశీలించారు. గణేష్ శోభాయాత్ర ప్రారంభమయ్యే బాలాపూర్ తోపాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో రహదారుల పరిస్థితి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నీరు నిలిచే ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు తదితర ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు. టీజీఐసీసీసీ ఇన్చార్జ్ అధికారి కమల్ హాసన్ రెడ్డి సీఎస్ కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న రియల్‌టైమ్ పర్యవేక్షణ, వివిధ ప్రాంతాల్లో పరిస్థితులపై అందుతున్న సమాచారం, శోభాయాత్ర మార్గాల్లో చేపట్టిన నిఘా ఏర్పాట్లను వివరించారు. శోభాయాత్ర మార్గాల్లో సీసీ టీవీ కెమెరాల ద్వారా చేపడుతున్న నిఘా, పర్యవేక్షణ ఏర్పాట్లను కూడా సీఎస్ పరిశీలించారు. కీలకమైన ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో సీసీ టీవీ నిఘాను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట్ల వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టా లని సీఎస్ సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాల కారణంగా శోభాయాత్రకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ శోభాయాత్ర సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్, వైద్య, అత్యవసర సేవలను సమన్వయంతో అందుబాటులో ఉంచాలని సీఎస్ సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించేలా సమన్వయం చేసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు.

# అమిత్ షాకు అస్వస్థత..

- హుబ్బళ్లి వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి గైర్హాజరు
- వైద్యుల సూచనతో హోటల్ గదిలోనే విశ్రాంతి
- సభలో విషయాన్ని వెల్లడించిన కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే
- అమిత్ షా స్థానంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తదితరులతో ప్రారంభోత్సవం
- • 1,200 పడకల ఆసుపత్రి, నూతన అకాడమిక్ భవనం ప్రారంభం



హుబ్బళ్లి, సెప్టెంబర్ 19: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. కర్ణాటకలోని హుబ్బళ్లిలో కేఎల్ఈ జగద్గురు గంగాధర మహాస్వామిగళు మూరుసావిరమఠ్ వైద్య కళాశాల నూతన అకాడమిక్ భవనం, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరు కావాల్సి ఉంది. అయితే ఆరోగ్యం సహకరించకపోవడంతో కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. వైద్యుల సూచన మేరకు హోటల్ గదిలోనే విశ్రాంతి తీసుకుంటున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**ప్రభాకర్ కోరే ప్రకటన**

ఈ విషయాన్ని కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు ప్రభాకర్ కోరే సభలో వెల్లడించారు. చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిన అమిత్ షా తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, వైద్యుల సూచనతో హోటల్ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని సభకు తెలియజేయాలని అమిత్ షా కోరినట్లు చెప్పారు.

**సంయుక్తంగా ప్రారంభోత్సవం**

అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్య విభాగాధిపతి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, బెళగావి ఎంపీ జగదీష్ శెట్టర్, శ్రీ జగద్గురు మూరుసావిరమఠానికి చెందిన శ్రీ గురుసిద్ధ రాజయోగింద్ర స్వామి కలిసి వైద్య సంస్థలను ప్రారంభించారు.

# డీయూలో ఏబీవీపీ హవా..

- సీజేపీ, జెన్‌జీ ఉద్యమాల తర్వాత విద్యార్థి తీర్పు..
- డూసూ కేంద్ర ప్యానెల్‌లో మూడు స్థానాలు ఏబీవీపీ ఖాతాలోకి
- ఎన్ఎస్‌యూఐకి నాలుగు కేంద్ర స్థానాల్లోనూ దక్కని విజయం
- యువత సమస్యలపై ఉద్యమాల తర్వాత వెలువడిన ఫలితాలతో రాజకీయ చర్చ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (DUSU) ఎన్నికల ఫలితాలు విద్యార్థి రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీశాయి. నాలుగు కేంద్ర పోస్టుల్లో మూడింటిని ఏబీవీపీ గెలుచుకోగా.. వైస్ ప్రెసిడెంట్ పదవిని స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ దక్కించుకున్నారు. అధ్యక్షుడిగా ఏబీవీపీకి చెందిన యశ్ దబాస్ 24,576 ఓట్లతో విజయం సాధించారు. ఆయన ప్రత్యర్థి ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనాకు 22,523 ఓట్లు వచ్చాయి. రియా ఛప్డీ కార్యదర్శిగా, లక్ష్య రాజ్ సింగ్ జాయింట్ సెక్రటరీగా గెలిచారు.

**రాజకీయ చర్చకు దారితీసిన ఫలితాలు**

కాంగ్రెస్ మద్దతు ఉన్న ఎన్ఎస్‌యూఐ ఒక్క కేంద్ర పోస్టును కూడా గెలుచుకోకపోవడం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా నిలిచింది. మరోవైపు మాజీ ఎన్ఎస్‌యూఐ అనుబంధం ఉన్న స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ 30,615 ఓట్లతో వైస్ ప్రెసిడెంట్‌గా గెలిచారు. ఏబీవీపీ అభ్యర్థి ఇషు మౌర్యకు 16,910, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి వీర్ ఛత్రత్‌కు 4,313 ఓట్లు వచ్చాయి.

**యువత ఉద్యమాల నేపథ్యంలో ఫలితాలపై ఆసక్తి**

2026లో పరీక్షలు, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థకు సంబంధించిన సమస్యలు యువత ఉద్యమాల్లో ప్రధాన అంశాలుగా మారాయి. నీట్ యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో 'కాక్‌రొచ్ జనతా పార్టీ' (CJP) ఉద్యమం ఉధృతమైంది. జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ప్రధానంగా వినిపించగా.. జూలై 25న ఆయన పదవికి రాజీనామా చేశారు. అనంతరం పరీక్షా వ్యవస్థలో సంస్కరణలకు కేంద్రం చర్యలు చేపట్టింది.

ఇదే సమయంలో విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమాన్ని చేపట్టారు. పేపర్ లీకులు, పరీక్షల నిర్వహణ, విద్యా ఖర్చులు, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై విద్యార్థులతో ఆయన చర్చిస్తున్నారు. సెప్టెంబర్ 19న ఇండోర్‌లో నిర్వహించిన కార్యక్రమంలోనూ విద్యార్థులు వ్యవస్థను ప్రశ్నించాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు.

**యువతపై రాజకీయ పార్టీల దృష్టి**

ఈ పరిణామాల నేపథ్యంలో విద్యార్థి ఎన్నికల ఫలితాలు రాజకీయ పార్టీలకు ప్రాధాన్యత కలిగిన అంశంగా మారాయి. అయితే డూసూ ఎన్నికల ఫలితాలను దేశవ్యాప్తంగా ఉన్న యువత లేదా జెన్‌జీ ఓటర్ల మొత్తం రాజకీయ వైఖరికి నేరుగా ప్రతిబింబంగా చూడడానికి ఈ ఒక్క ఎన్నిక సరిపోదు. డూసూలో ఓటు వేసిన విద్యార్థుల స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, విద్యార్థి సంఘాల సంస్థాగత బలం వంటి అంశాలు కూడా ఫలితాలను ప్రభావితం చేసి ఉండవచ్చు.

అదే సమయంలో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఎన్నికల్లో ఏబీవీపీ మూడు కేంద్ర స్థానాలు గెలవడం, మరో కీలక స్థానాన్ని స్వతంత్ర అభ్యర్థి గెలుచుకోవడం.. విద్యార్థి రాజకీయాల్లో వివిధ ధోరణులు కొనసాగుతున్నాయనే అంశాన్ని మాత్రం స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా వైస్ ప్రెసిడెంట్‌గా గెలిచిన దీపాంశు షోకీన్ గతంలో ఎన్ఎస్‌యూఐ నుంచి టికెట్ కోరినప్పటికీ స్వతంత్రంగా పోటీ చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి.

**రాజకీయ ప్రభావంపై భిన్న అంచనాలు**

డూసూ ఫలితాలను బీజేపీ అనుకూల విద్యార్థి రాజకీయాలకు అనుకూల సంకేతంగా పార్టీ వర్గాలు ప్రచారం చేసే అవకాశం ఉంది. అదే సమయంలో ఈ ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా జెన్‌జీ యువత ఏదైనా ఒక పార్టీ వైపు మళ్లిందని నిర్ధారించడం తొందరపాటు అవుతుంది. రాబోయే రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు యువత సమస్యలు, విద్య, ఉద్యోగాలు, పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై తమ ప్రచారాన్ని మరింతగా కేంద్రీకరించే అవకాశం ఉంది.



# 2047 లక్ష్యం.. యువతే కీలకం

- అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో యువత భాగస్వామ్యం అవసరం
- ఎఫ్‌టీఏలతో కొత్త మార్కెట్లు.. యువతకు ఉద్యోగ, కెరీర్ అవకాశాలు
- ఇప్పటివరకు 40 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
- బ్రిక్స్ భాగస్వామ్యంలో యువత, పారిశ్రామికవేత్తలు చురుగ్గా ఉండాలి
- 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయాలని మోదీ సూచన
- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి పైగా నియామక పత్రాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత పాత్ర అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) యువతకు కొత్త ఉద్యోగ, కెరీర్ అవకాశాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా 51 వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు.

**ఎఫ్‌టీఏలతో విస్తరిస్తున్న అవకాశాలు**

భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 ఎఫ్‌టీఏలు చేసుకుందని మోదీ తెలిపారు. వీటి ద్వారా దేశీయ వ్యాపారులకు కొత్త మార్కెట్లు, భాగస్వామ్యాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో భారత యువతకు నైపుణ్యాలు, ప్రతిభ ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో భారత యువత సామర్థ్యంపై నమ్మకం పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ సేవల్లోకి అడుగుపెడుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశ అభివృద్ధి, స్వావలంబన లక్ష్యాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.



**బ్రిక్స్‌లో యువత భాగస్వామ్యం**

ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సును ప్రస్తావించిన ప్రధాని.. ప్రభుత్వాల మధ్య సహకారానికే బ్రిక్స్ పరిమితం కాకూడదన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా అంతర్జాతీయ భాగస్వామ్యంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని చెప్పారు.

**'నాగరిక్ దేవో భవ'తో సేవ**

ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరుతున్న వారు 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో పనిచేయాలని మోదీ సూచించారు. కొత్త సాంకేతికత, వ్యవస్థలను అర్థం చేసుకుంటూ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని అన్నారు. 'మిషన్ కర్మయోగి' ఈ దిశగా ఉద్యోగులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పౌరులకు ప్రభుత్వంతో ఎదురయ్యే అనుభవమే ప్రభుత్వంపై వారి నమ్మకాన్ని నిర్ణయిస్తుందని, ఒక పౌరుడి జీవితం సులభతరం అయ్యేలా పనిచేయడమే నిజమైన విజయమని చెప్పారు.

**12.75 లక్షల మందికి నియామకాలు**

20వ రోజ్‌గార్ మేళాను దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించారు. రెవెన్యూ, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా ఎంపికైన వారు విధుల్లో చేరనున్నారు. ఈ మేళాతో కలిపి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందించినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# అభివృద్ధి–పర్యావరణం.. రెండూ కలిసే సాగాలి

- విజ్ఞాన్ భవన్‌లో ఎన్డీటీవీ గ్లోబల్ గ్రీన్ మీట్‌లో ప్రధాని మోదీ ప్రసంగం
- భవిష్యత్ తరాలకు వనరులు అందేలా అభివృద్ధి విధానాలు ఉండాలి
- విద్యుత్ వాహనాల వినియోగంతో కాలుష్యాన్ని తగ్గించే అవకాశం
- రైల్వేల విద్యుదీకరణతో కోట్ల లీటర్ల డీజిల్ ఆదా
- కాప్–21 లక్ష్యాలను గడువుకు ముందే భారత్ చేరుకుంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: దేశ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమాంతరంగా కొనసాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ఎన్డీటీవీ గ్లోబల్ గ్రీన్ మీట్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రకృతి వనరులను కాపాడుతూనే ఆర్థిక, సామాజిక ప్రగతిని ముందుకు తీసుకెళ్లడమే స్థిరమైన అభివృద్ధికి మార్గమని పేర్కొన్నారు.

**స్వచ్ఛమైన రవాణాపై దృష్టి**

భారత్‌లో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. రవాణా రంగంలో స్వచ్ఛమైన ఇంధనాన్ని ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. రైల్వేల విద్యుదీకరణతో ఇప్పటికే కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని పేర్కొన్నారు. విద్యుత్ ఆధారిత రవాణా విస్తరణ ఇంధన పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు.

**వాతావరణ లక్ష్యాల్లో ముందడుగు**



అంతర్జాతీయ వాతావరణ లక్ష్యాల సాధనలో భారత్ ముందుగానే చర్యలు చేపట్టిందని ప్రధాని తెలిపారు. కాప్-21లో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువుకు ముందే భారత్ సాధించిందని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రకృతి వనరుల సంరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్ తరాలకు అవసరమైన వనరులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు

# డూసూ ఫలితాలపై సీజేపీ నేత సంచలన వ్యాఖ్యలు

- ప్రతిపక్షాల ఓట్ల చీలికతోనే ఏబీవీపీ విజయం
- మెజారిటీ విద్యార్థులు ప్రస్తుత పాలనకు వ్యతిరేకమే
- గెలిచిన వారు 'రాజులు, రాణులు కాదు: సౌరవ్ దాస్ వ్యాఖ్య
- కాంగ్రెస్ సీజేపీపై దృష్టి పెట్టడం కంటే రాజకీయ వ్యూహాన్ని మార్చుకోవాలని సూచన
- దీపాంశు షోకీన్ గెలుపును ప్రతిపక్షాలకు ఉదాహరణగా ప్రస్తావన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (DUSU) ఎన్నికల ఫలితాలపై కాక్రోచ్ జనతా పార్టీ (CJP) సభ్యుడు సౌరవ్ దాస్ స్పందించారు. ప్రతిపక్షాల మధ్య ఓట్లు చీలిపోవడం వల్లే ఏబీవీపీ మూడు కేంద్ర పోస్టులను గెలుచుకోగలిగిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా మెజారిటీ విద్యార్థులు ఉన్నప్పటికీ.. ప్రతిపక్ష ఓట్ల విభజన ఫలితాలపై ప్రభావం చూపిందని పేర్కొన్నారు.

**గెలిచినవారు 'రాజులు కాదు'**

ఎన్నికల్లో విజయం సాధించిన వారు 'రాజులు లేదా రాణులు కాదు' అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సౌరవ్ దాస్ అన్నారు. గెలిచిన అభ్యర్థులకు మెజారిటీ విద్యార్థులు ఓటు వేయలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, దాని అనుబంధ సంస్థలు సీజేపీపై దృష్టి పెట్టడం కంటే తమ రాజకీయ వ్యూహాన్ని పునఃపరిశీలించుకోవాలని సూచించారు. ఈ మార్పు ప్రక్రియ 12 ఏళ్లుగా కొనసాగుతున్నప్పటికీ..ప్రజలు ఇక సహనం కోల్పోతున్నారని అన్నారు.

**దీపాంశు గెలుపును ఉదాహరణగా..**



ఎన్ఎస్‌యూఐ టికెట్ లభించకపోవడంతో స్వతంత్రంగా పోటీ చేసి వైస్ ప్రెసిడెంట్‌గా దీపాంశు షోకీన్ భారీ మెజారిటీతో గెలవడాన్ని సౌరవ్ దాస్ ప్రస్తావించారు. లెఫ్ట్ పార్టీల్లోని కొన్ని వర్గాలు 'సైద్ధాంతిక స్వచ్ఛత, ప్రత్యేకత'కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు ఇదే విధంగా విడివిడిగా కొనసాగితే.. అధికార పక్షాన్ని ఎదుర్కోవడంలో ఇబ్బందులు తప్పవని, ప్రతిపక్షంలోనే కొనసాగాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

**ఏబీవీపీకి మూడు పోస్టులు**

డూసూ ఎన్నికల్లో నాలుగు కేంద్ర పదవుల్లో మూడు ఏబీవీపీ ఖాతాలోకి వెళ్లాయి. యశ్ దబాస్ అధ్యక్షుడిగా, రియా ఛాప్డీ కార్యదర్శిగా, లక్ష్య రాజ్ సింగ్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ విజయం సాధించారు. ఏబీవీపీ విజయంతో బీజేపీ వర్గాల్లో ఉత్సాహం కనిపించగా.. కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు విజేతలకు అభినందనలు తెలిపారు.

# వ్యవస్థను ప్రశ్నిస్తున్న విద్యార్థులే దేశ భవిష్యత్

- ఇండోర్ కార్యక్రమంలో విద్యార్థులతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సంభాషణ
- ప్రశ్నించడం, జిజ్ఞాస విద్యార్థుల సహజ లక్షణాలన్న రాహుల్
- ఇతర సిద్ధాంతాలు, ఆలోచనలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారని వ్యాఖ్య
- నిజాయితీగా పనిచేయడం విద్యార్థుల అత్యంత ముఖ్యమైన గుణమని వెల్లడి
- పాఠశాలలు, మౌలిక వసతులపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందని సూచన

ఇండోర్, సెప్టెంబర్ 19: విద్యార్థులే భారతదేశ భవిష్యత్ అని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇండోర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులు లేకుండా ఏ దేశమూ బలోపేతం కాదని పేర్కొన్నారు.

**ప్రశ్నించే తత్వమే బలం**

విద్యార్థులకు సహజంగానే జిజ్ఞాస ఉంటుందని రాహుల్‌గాంధీ అన్నారు. వారు ప్రశ్నలు అడుగుతూ ఇతర సిద్ధాంతాలు, భిన్నమైన ఆలోచనలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. విద్యార్థులు పోరాటాలు, బెదిరింపులు, భయపెట్టే విధానాలను అనుసరించరని




పేర్కొంటూ.. నిజాయితీగా పనిచేయడం వారి ప్రధాన లక్షణమని చెప్పారు.

**వ్యవస్థపై ప్రశ్నలు ఎందుకు ఉండకూడదు?**

విద్యార్థులు వ్యవస్థను ప్రశ్నిస్తుంటే కొందరు 'గుడ్డి అనుచరులు' అందుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. దేశంలో అభివృద్ధి అవసరం లేదంటూ మాట్లాడేవారు.. పాఠశాలలు ఎందుకు అధ్వాన్న స్థితిలో ఉన్నాయో ప్రశ్నించడం లేదని అన్నారు. మౌలిక సదుపాయాలు ఎందుకు క్షీణిస్తున్నాయో, దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాలు ఎందుకు లీక్ అవుతున్నాయో కూడా నిలదీయడం లేదని పేర్కొన్నారు.

# కరెంటు కోతలతో రైతు విలవిల.. కార్యాలయం ముందు బీజేపీ ధర్నా

- 'సీఎం డౌన్ డౌన్' నినాదాలతో హోరెత్తిన కొత్త కొత్తూరు
- కొత్త కొత్తూరు ఏ ఈ కి వినతిపత్రం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ పార్టీ కదం తొక్కింది. మండలంలోని కొత్త కొత్తూరు విద్యుత్ కార్యాలయం ముందు బీజేపీ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించాయి. ఈ ఆందోళనకు వైసీపీ మండల నాయకులు కూడా సంఘీభావం తెలపడంతో కార్యక్రమం మరింత ఉధృతంగా సాగింది.

**నాట్లు ఎండిపోతున్నాయని ఆవేదన..**

ఈ సందర్భంగా నేలకొండపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక భూములు బీటలు వారుతున్నాయని, అరకొర వర్షాలతో ఆశగా నాట్లు వేసుకున్న రైతులకు కరెంటు అందక పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోజుకు 3-4 గంటలు కూడా కరెంటు రావడం లేదు. మోటార్లు తిరగక, నీరు అందక నాట్లు ఎండిపోతుంటే రైతు గుండె పగిలిపోతోంది" అని ఆయన విమర్శించారు.

**మంత్రి ఇలాకాలోనే ఇలాగా?**

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే విద్యుత్ పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల పరిస్థితి ఏంటని సుధాకర్ ప్రశ్నించారు. మంత్రి ఇలాకా అని చెప్పుకుంటున్న నేలకొండపల్లిలోనే రైతులు కరెంటు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం సిగ్గుచేటని అన్నారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఈ సమయంలోనే కరెంటు కోతలు విధిస్తే రైతు బతికేదెలా అని నిలదీశారు.

**నినాదాలతో మార్మోగిన వాతావరణం..**

ధర్నా సందర్భంగా కార్యకర్తలు 'సీఎం డౌన్ డౌన్', 'రైతులను ఆదుకో', 'కరెంటు కోతలు ఆపాలి' అంటూ భారీ నినాదాలు చేశారు. దీంతో కొత్త కొత్తూరు విద్యుత్ కార్యాలయం పరిసరాలు మార్మోగాయి. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

**బీజేపీ డిమాండ్లు:**

వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి.ఎండిపోతున్న పంటలను గుర్తించి రైతులను ఆదుకోవాలి. అకాల విద్యుత్ కోతలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని నేలకొండపల్లి కొత్త కొత్తూరు ఏఈ గుద్దేటి రవి కి వినత పత్రం అందజేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాబోయే రోజుల్లో మండల కేంద్రంలో భారీ ఆందోళన చేపడతామని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి జె పీ మండల నాయకులు బాజా రామకృష్ణ, బిజెపి మండల నాయకులు సూరపల్లి జ్ఞాన రత్నం, కూరాకుల దివాకర్, కొండా హర్షవర్ధన్, పిట్టల సూరిబాబు, ఏపూరి సత్యనారాయణ, మూడు రమేష్, కొమపులి స్వామి దాసు, కాలింగ్ వెంకటేశ్వర్లు, కాలింగ్ వీరయ్య వైయస్సార్సీపి మండల ఉపాధ్యక్షులు కే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

# మహిళలు జిజియ బాయి స్ఫూర్తితో జీవితంలో ముందుకు సాగాలి...



**యువత శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగి సనాతన ధర్మం నిలబెట్టాలి...**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ప్రతి మహిళ జిజియ బాయి స్ఫూర్తిత, ప్రతి యువకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ముందుకు సాగినప్పుడే సనాతన ధర్మం, హిందూ సంస్కృతి మరింత బలబడుతుందని భాజపా ఎండోమెంట్స్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, చెందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తులు, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి అనంతగిరి జిల్లా వికారాబాద్‌లోని శివాజీనగర్ బాలభక్త సమాజం కట్ట మైసమ్మ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవరాత్రి గణేష్ మండపం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా, ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...తొలి పూజలందుకునే విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ కాలం నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. అనంతరం లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను ప్రజలను ఒక వేదికపైకి తీసుకువచ్చే కార్యక్రమంగా మలిచి, స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. ప్రతి మహిళ రుద్రమదేవి, జిజాబాయి వంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, యువత సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి దేశభక్తుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వికారాబాద్ మాజీ బిజెపి అధ్యక్షులు, సేంద్రియ వ్యవసాయ బోధకులు, భగవద్గీత పారాయణ నిర్వాహకులు సదానంద రెడ్డి, ఆయన సతీమణి శ్రీదేవి మాట్లాడుతూ.. పురాతన సనాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తూ, చందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడిగా ఆలయ నిర్మాణ కార్యక్రమాల్లో సేవలందిస్తున్న ఆర్. నరేష్ కుమార్ చేస్తున్న సనాతన ధార్మిక సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవలు మారుమూల గ్రామాలకు విస్తరించినప్పుడే ప్రజల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్యం మరింత పెరుగుతుందని అన్నారు. అనంతరం ఆర్. నరేష్ కుమార్‌ను ఘనంగా సన్మానించి గౌరవించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 60 గజాల బాధితులకు శుభవార్త, 60 గజాలు కాదు...

- 72 గజాలు ఇస్తానని హామీ ఇచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- 19 ఏళ్ల పెండింగ్ సమస్యకు పరిష్కారం...



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్ నగర్ పరిధిలోని సర్వే నంబర్ 151లో 19 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల సమస్యకు చివరకు పరిష్కారం లభించింది. శనివారం రోజు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన బాధితులకు 60 గజాలు కాదు అజీజ్ నగర్ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 176 లో 72 గజాల స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2007లో హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో 290 మంది పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు ఇచ్చినప్పటికీ19 ఏళ్లు గడిచినా వారికి స్థలాలు కేటాయించలేదు. దీంతో బాధితులు తీవ్ర ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేస్తూ...86 రోజులుగా ఆందోళనలు, దీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం అదే సర్వే నంబర్‌లో మార్కెట్ యార్డు నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వచ్చాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బాధితులు శనివారం రోజు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, మంత్రి సీతక్క(దానసారి అనసూయ) ను కలిశారు. ఈ సందర్భంగా బాధితులు తమ సమస్యలను మంత్రికి వివరించి పట్టాలు ఉన్న వారికి స్థలాల కేటాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ పట్టాలు ఉన్న అర్హులందరికీ 60 గజాల స్థలం కాకుండా 72 గజాల స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 19 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని బాధితులు వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని త్వరితగతిన అమలు చేసి, అర్హులైన పట్టాదారులకు స్థలాలను కేటాయించాలని వారు కోరారు. 19 ఏళ్ల నిరీక్షణ తర్వాత లభించిన ఈ హామీతో బాధితులకు కొంత ఊరట లభించింది. ప్రభుత్వం ఈ హామీని త్వరగా అమలు చేసి పట్టాదారులకు స్థలాలు కేటాయించాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీద శ్రీను, శాంతి యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విటల్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూత్ అధ్యక్షుడు కరీమ్, సేవాలాల్ యూత్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, రెడ్డిపల్లి సుమన్, షాబాద్ ప్రవీణ్, కాళిదాసు చారి , షాబాద్ నాగరాజ్, ధార్గుపల్లి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# హైదర్‌నగర్‌లో ఘనంగా అన్నదానం

- 2 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ
- హైదర్‌నగర్ బాల గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** హైదర్‌నగర్‌లోని బాల గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని గణేష్ మండపం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 2,000 మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రజలపై ఆ గణనాథుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి 'సూర్యఉదయం' తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ బాషా తన బృందంతో కలిసి హాజరయ్యారు. వారికి అసోసియేషన్ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి, అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రమోద్ గౌడ్, పోతుల రాజేందర్, హబీబ్ భాయ్, యాసిన్ భాయ్, శ్రీను, మహేష్, సురేష్ లతో పాటు పాత్రికేయులు శ్యాంసుందర్, సునీల్ కుమార్, క్రాంతి, బాల తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ 3వ వార్డులో శివాజీ గణేష్ మండపం వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం...



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో గణేష్ నవరాత్రుల సందర్భంగా శివాజీ గణేష్ మండపం వద్ద భక్తులకు ఘనంగా అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ అన్న సమర్పణ కార్యక్రమానికి సహకారం అందించిన చేవెళ్ల జైరామ్ రెడ్డి, సురేష్, సంతోష్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, రాజ్యలక్ష్మి చిన్నలను భక్తులు అభినందించారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాలనీవాసులు ఎంతో కష్టపడి సహకరించారు. కార్యక్రమంలో శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్, బిజెపి నాయకులు నరసింహారెడ్డి, కుమార్, గోవింద్ గౌడ్, సుధాకర్ గౌడ్, నాని, నయన్, బాబీ, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీ వాసులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## 136 మంది లబ్ధిదారులకు రూ.49.45 లక్షల సి ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు రూ.49.45 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేలకొండపల్లి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసానిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, నెల్లూరు భద్రయ్య బొందయ్య పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక మండపాల వద్ద అన్నసమారాధన

- చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో 1000 మందికి అన్నప్రసాద వితరణ
- పాల్గొన్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** ఆదర్శ్ నగర్ యూత్ అసోసియేషన్ గణనాథ మండపం వద్ద బీజేపీ రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా గోవర్ధన్ గౌడ్ ఐదు గణనాథ మండపాల వద్ద అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మోదీ పేరిట అన్నదానం చేయడం అదృష్టమని, ఆదర్శ్ నగర్, లింగంపల్లి రెయిన్ ట్రీ, గోపి నగర్ బజరంగ్ యూత్, ప్రశాంత్ నగర్ మండపాల వద్ద కలిపి 6 వేల మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, రంగా గౌడ్, బెజగం కేశవులు, పుట్ట వినయ్ కుమార్ గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీనివాస్ నాయి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'సేవా పఖ్వాడా' కార్యక్రమాలు వైభవంగా ముగింపు




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** మై భారత్ యూత్ వాలంటీర్ కొక్కిరేణి నాగ పృథ్వీరాజ్ నేతృత్వంలో నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం బ్లాకుల పరిధిలో 'సేవా పఖ్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ లింగ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సుమంత్, రామయ్య, వెంకన్న, లతీఫ్, గోపాలకృష్ణ, భాస్కర్, సూర్యప్రకాష్, ప్రమోద్, శివ పాల్గొన్నారు.యువతలో సేవాభావాన్ని, సామాజిక స్పృహను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు మెమెంటోలు అందజేసి అభినందించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. దేశ సేవ, సమాజ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిస్తూ అందరితో సేవా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నాగ పృథ్వీరాజ్ మాట్లాడుతూ యువశక్తి దేశానికి వెన్నెముక అని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహా పనులను పరిశీలిస్తున్న చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం



**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండలం పల్లెర్ల గ్రామంలో పల్లెర్ల మిశ్రమ చేనేత సహకార సంఘ భవన ఆవరణలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా విగ్రహ నిర్మాణ పనులను చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం పరిశీలించారు . వారి వెంట చేనేత సహకార సంఘం కోశాధికారి సాయిని పురుషోత్తం , చేనేత సహకార సంఘం డైరెక్టర్ గుర్రం మల్లేష్ తదితరులు ఉన్నారు .

## అంగన్వాడి కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండలం పల్లెర్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహ గౌడ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు . మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు . పోషణ మాసం సందర్భంగా పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు . ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ జి వాణిశ్రీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి కృష్ణవేణి వార్డు సభ్యురాలు పొడుగు భార్గవి సత్యనారాయణ , అంగన్వాడీ టీచర్లు మేడి మాధవి , నాయిని అండాలు కానుకట్ల మేఘలత , ఆశ కార్యకర్తలు పొడుగు చంద్రకళ , ఏలూరి కవిత , గర్భిణీ స్త్రీలు , బాలింతలు , చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు .

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పాలభిషేకం




**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో శనివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ పాలాభిషేకం చేశారు. గత నెల నుండి హమారా ప్రసాద్ అనే వ్యక్తి డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ పైన అనుచిత వాక్యాలు చేస్తూ భారతదేశ రాజ్యాంగాన్ని అవమానిస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ కల్పితము అనే బుక్కు రాస్తూ బడుగు బలహీన వర్గాల పైన చేస్తున్న అమార ప్రసాద్ పై చర్య తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం స్పందించి హమారా ప్రసాదును అరెస్టు చేసినందుకు అందువలన అంబేద్కర్ కు ఉప్పల్వాయి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కామారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి కోతోల్లా యాదగిరి, మాజీ ఉప సర్పంచ్ పల్లె నర్సింలు, అరవింద్ గౌడ్, గ్రామ ఉప సర్పంచ్ ఆల పర్వ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కుమ్మరి సాయి, కోతోల్లా అనిల్, శివరాజు, సంకిలింగం, కోతోల్లా సాయిలు, దాసరి గంగారం, ముదిరాజ్ సంఘం ఆగర్ బత్తీల రాములు, మంగలి సాయిలు, పోసానిపేట్ గిద్ద కన్నాపూర్, గోకుల్ తండా గ్రామాల్లో పాలాభిషేకం చేశారు.

## నీట్ ఫలితాల్లో ఎంబిబిఎస్ ఆణిముత్యాలు

- రామారెడ్డి గ్రామానికి పేరు తీసుక వచ్చిన యువతి, యువకుడు..
- రామారెడ్డి గ్రామానికి చెందిన ఎంబిబిఎస్ సీటు సాధించిన వైనం..!




**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** నీట్ లితాల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించిన యువతి, యువకుడు ఆనందం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన యువతీ, యువకుడు ఎంబీబీఎస్ సీటు సాధించారు. రామారెడ్డి గ్రామానికి చెందిన బత్తిని రోహన్ ఎంబిబిఎస్ రాష్ట్ర స్థాయిలో 2694 ర్యాంకు సాధించడం ఎంతో సంతోషమని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన దొంతుల సాగరిక రాష్ట్ర స్థాయిలో 4221 ర్యాంకు సాధించడం ఎంతో సంతోషమని కుటుంబ సభ్యులు తెలిపారు. రామారెడ్డి గ్రామానికి చెందిన బత్తిని గోవర్దన్ చాలా కష్టపడి విద్యార్థులను చదివించాడు. బత్తిని గోవర్దన్ ఇటీవల చనిపోవడం పట్ల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ర్యాంకు సాధించడం ఎంతో సంతోషమని గ్రామస్తులు వర్షం వ్యక్తం చేశారు. దొంతుల సాగరిక ఎంబిబిఎస్ సాధించడం పట్ల తండ్రి దశరథ్ చాలా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ ఇద్దరికీ ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఇద్దరికీ అభినందనలు చెప్పడం పట్ల కుటుంబ సభ్యులు చాలా హర్షం వ్యక్తం చేశారు.

## ఆరోగ్య కేంద్రంలో పాముకాటు నివారణపై అవగాహన డాక్టర్ సురేష్




**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో పాముకాటు నివారణ సకాలంలో చికిత్స పొందడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి కి వచ్చిన రోగులు, వారి సహాయకులు ప్రజలకు పాముకాటు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స ఆసుపత్రికి త్వరగా చేరుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. సురేష్, మెడికల్ ఆఫీసర్, రామారెడ్డి పి హెచ్ సి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా వ్యవసాయ పనులు చేసే సమయంలో, రాత్రివేళల్లో మరియు వర్షాకాలంలో పాముకాటు ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు, పాముకాటును నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పొలాల్లో, పొదల్లో పనిచేసేటప్పుడు బూట్లు, చేతులకు రక్షణ కలిగించే దుస్తులు ధరించాలి.రాత్రివేళల్లో బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టార్చ్ లైట్ ఉపయోగించాలి.ఇళ్ల చుట్టూ పొదలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలి. రాళ్లు, కట్టెలు, పాత వస్తువులు లేదా పొదల్లో చేతులు పెట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఇళ్లలో ఎలుకల బెడదను తగ్గించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.

**పాము కరిచినప్పుడు ఏమి చేయాలి?**

పాము కరిచిన వ్యక్తిని ప్రశాంతంగా ఉంచి, కదలికలను సాధ్యమైనంత వరకు తగ్గించాలి. కరిచిన అవయవాన్ని స్థిరంగా ఉంచి, వీలైనంత త్వరగా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైనప్పుడు ఆసుపత్రిలో యాంటీ స్నేక్ వెనం ఏ ఎస్ వి చికిత్స అందుబాటులో ఉంటుంది. చేయకూడని పనులు పాము కరిచిన ప్రదేశాన్ని కత్తితో కోయడం, నోటితో విషాన్ని పీల్చడం, గట్టిగా తాడు కట్టడం, మంచు/రసాయనాలు/ఆకులు లేదా ఇతర స్థానిక మందులు పూయడం వంటి పద్ధతులను పాటించకూడదని ప్రజలకు వివరించారు. పామును పట్టుకోవడానికి లేదా చంపడానికి ప్రయత్నించకుండా, బాధితుడికి తక్షణ వైద్య సహాయం అందించడమే ముఖ్యమని సూచించారు. “పాముకాటు విషయంలో ప్రతి నిమిషం విలువైనదే — ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం ప్రాణాలను కాపాడుతుంది” అని డాక్టర్ ఎం. సురేష్ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఈ హెచ్ సి సిబ్బంది పాల్గొని ప్రజలకు పాముకాటు నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు సకాలంలో వైద్య సేవలు పొందడం గురించి వివరించారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం...

- రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య




**చేవెళ్ల , రాజముద్ర న్యూస్:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల, శంకర్ పల్లి మండలాలకు సంబంధించిన రైతులకు తెల్ల కుసుమ విత్తనాలను పంపిణీ చేసిన స్థానిక శాసన సభ్యులు కాలె యాదయ్య. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ... చేవెళ్ల, శంకర్ పల్లి మండలాలకు చెందిన రైతులకు తెల్ల కుసుమ విత్తనాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. మన రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించుకుని మంచి దిగుబడులు సాధించాలని కోరుతున్నా అన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. రైతు అభివృద్ధి, వ్యవసాయ అభివృద్ధి, గ్రామీణాభివృద్ధే మన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడిసిన్ లో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మున్నూరు కాపు మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు మండల అధ్యక్షులుగా ల్యాగల మహిపాల్, ప్రధాన కార్యదర్శి బండి లింగం, గౌరవ అధ్యక్షులు చెన్నం శెట్టి రమేష్, ప్రచార కార్యదర్శిగా కడెం సాయికుమార్, గ్రామ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏకగ్రీవ ఎన్నుకున్నారు అదేవిధంగా రామారెడ్డి మండలం నుండి మద్దికుంట గ్రామానికి చెందిన పైడాకుల లింగం కూతురు పైడాకుల మేఘన మెడిసిన్ లో ప్రభుత్వ కళాశాలలో సీట్ సాధించిన అందుకు మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ , జిల్లా కమిటీ అభినందనలు తెలపడం జరిగింది మండల శాఖను జిల్లా శాఖ ఘనంగా సన్మానం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కడెం శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి కాల హనుమాన్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పెట్టి గాడి అంజయ్య కోశాధికారి కుంటిఆంజనేయులు జిల్లా బాధ్యులు వెంకట్రాజ్యం రమేష్ రాజు పాల్గొన్నారు.



## గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

**రాజముద్ర న్యూస్, బోథ్:** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు బోథ్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేరుగు భోజన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా బోథ్ మండలంలోని 21 గ్రామాలకు నూతన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులను నియమించినట్లు తెలిపారు. ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన గ్రామ అధ్యక్షులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం నూతన అధ్యక్షులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, అంజయ్య, అచ్యుత్‌రెడ్డి, కౌసర్, అబూద్, ఉమేష్ జాదవ్, బొడ్డు గంగారెడ్డి, మేరుగు నర సింహాదాస్, చాట్ల ఉమేష్, షేక్, బొజ్జ సాయన్న, అలీం, జగన్, అబ్రార్, అమీరోదిన్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ‘డబుల్’ ఇళ్లకు అవసరమైన మరమ్మతులు చేయించాలి

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**రాజముద్ర న్యూస్, కరీంనగర్:** కరీంనగర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గృహ నిర్మాణ శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రస్తుత పరిస్థితి,



చేపట్టాల్సిన మరమ్మతులు, పరిసరాల పరిశుభ్రత, నీరు, విద్యుత్, రోడ్లు తదితర కనీస వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రం చేయించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించిన అనంతరం ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన పనులను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈ ప్రవీణ్, ఆర్అండ్‌బీ డీఈ శ్రీకాంత్, జేఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# భారత చెస్ జట్ల 'హ్యాట్రిక్' విజయం

చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల, పురుషుల జట్లు వరుసగా మూడో విజయం నమోదు చేసి 'హ్యాట్రిక్' సాధించాయి. భారత మహిళల జట్టు 3.5–0.5తో గ్రీస్‌ను ఓడించింది. బోర్డు–1పై ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి 46 ఎత్తుల్లో స్టావ్‌రూలా సొలాకిడూపై గెలిచింది. బోర్డు–2పై దివ్యదేశ్‌ముఖ్, అనస్తాసియా అవ్రామిడూ గేమ్ 49 ఎత్తుల్లో 'డ్రా' అయింది.

బోర్డు–3పై వంతిక అగర్వాల్ 44 ఎత్తుల్లో ఎకతెరీని పావ్లిడూపై... బోర్డు–4పై సవితా శ్రీ 66 ఎత్తుల్లో అంటోనియా క్రిస్టోడులాకీపై గెలుపొందారు. భారత పురుషుల జట్టు 3–1తో ఇటలీపై నెగ్గింది. బోర్డు–1పై ప్రజ్ఞానంద, లొరెంజో లోడికి గేమ్ 41 ఎత్తుల్లో... బోర్డు–2పై ఇరిగేశి అర్జున్–లుకా మొరోని గేమ్ 64 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. బోర్డు–3పై నిహాల్ సరీన్ 40 ఎత్తుల్లో ఫ్రాన్సెస్కో సోనిస్‌పై... బోర్డు–4పై దొమ్మరాజు గుకేశ్ 33 ఎత్తుల్లో సబీనో బ్రునెల్లోపై గెలుపొందారు. నేడు జరిగే నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో స్పెయిన్‌తో భారత పురుషుల జట్టు; మంగోలియాతో భారత మహిళల జట్టు తలపడతాయి.

# నా కెరీర్‌లో అదే అత్యంత కఠిన నిర్ణయం: గౌతమ్ గంభీర్



స్వదేశంలో అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను భారత జట్టు క్లీన్ స్వీప్ చేసింది. ఈ సిరీస్ అసాంతం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా ఆఖరి టీ20లో అయితే భారత బ్యాటర్లు చెలరేగిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లో శతక్కొట్టి, అంతర్జాతీయ టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచూరియన్‌గా నిలవగా.. సంజూ శాంసన్ హాఫ్ సెంచరీతో రాణించాడు. ఫలితంగా శ్రేయస్ సేన ప్రత్యర్థి ముందు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది. అఫ్గాన్ ఈ కొండంత లక్ష్యాన్ని ఛేధించలేక 94 పరుగులకే కుప్పకూలింది. ఇక ఈ మ్యాచ్ అనంతరం భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తమ ఆటగాళ్లపై ప్రశంసల వర్షం కురిపించాడు. టీ-20ల్లో 300 పరుగులు సాధించడమే మా లక్ష్యమని గంభీర్ అన్నాడు.

"అఫ్గానిస్తాన్‌తో చివరి మ్యాచ్‌లో భారత జట్టుకు మెరుపు ఆరంభం దక్కింది. మరీ ముఖ్యంగా పవర్‌ప్లేలో మనవాళ్లు చాలా దూకుడుగా ఆడారు. ఆరు ఓవర్లలోనే జట్టు స్కోరు 100 పరుగుల మార్క్ దాటింది. నా కోచింగ్ కాలంలో ఇదే అత్యధికం. దూకుడుగా ఇన్నింగ్స్‌ను ఆరంభించినప్పుడు అదే జోరు కొనసాగిస్తే భారీ స్కోరు సాధ్యమే. టి20ల్లో ఇప్పటి వరకు మన జట్టు 300 మైలురాయిని అందుకోలేదు.

మా తదుపరి లక్ష్యం అదే. ఎందుకంటే డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ప్రతిభతో అదేం పెద్ద కష్టం కాదు. అభిషేక్ దూకుడు అందరికీ తెలిసిందే. అఫ్గాన్‌తో మూడో టి20లో అతడి సెంచరీ డ్రెస్సింగ్ రూమ్‌పై చాలా ప్రభావం చూపింది" అని గంభీర్ పేర్కొన్నాడు. కాగా సిరీస్‌లో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితం కావడంపై గంభీర్ స్పందించాడు. వైభవ్ సూర్యవంశీలో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ, అతడు స్వదేశంలో అరంగేట్రం చేసేందుకు మరికొంత కాలం వేచి చూడక తప్పదని గంభీర్ వెల్లడించాడు.

ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ సందర్భంగా సంజూ సామ్సన్‌ను తుది జట్టు నుంచి తప్పించడం తన కెరీర్‌లోనే అత్యంత కఠిన నిర్ణయమన్న గంభీర్... వన్డే, టెస్టు సారథి శుబ్‌మన్ గిల్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని వివరించాడు.





## ప్రారంభమైన ఆసియా గేమ్స్.. కిట్ ఆలస్యంతో మారిన భారత ఫ్లాగ్‌బేరర్

ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అయితే, ఈ ఆరంభ వేడుకల్లో భారతదేశ ఫ్లాగ్‌బేరర్ చివరి నిమిషంలో మారిపోయారు. ప్రముఖ కబడ్డీ ప్లేయర్ పవన్ సహ్రావత్‌ను పతాకధారిగా ఎంపిక చేశారు. తొలుత ఆ స్థానంలో షాట్‌పుటర్ తజిందర్‌పాల్ సింగ్ తూర్ ఎంపిక కాగా.. కిట్ ఆలస్యం కారణంగా పతాకధారిని మార్చాల్సి వచ్చింది. జెర్సీ సహా ఇతర క్రీడావస్తువులు ఉండే అధికారిక కిట్ తజిందర్‌కు ఇంకా అందకపోవడం వల్ల ఆసియా క్రీడల ప్రారంభోత్సవానికి అతడు హాజరుకాలేకపోయాడు. ఆరంభ వేడుకల్లో పవన్.. స్టార్ షూటర్ మనుబాకర్‌తో కలిసి భారత బృందానికి నాయకత్వంతో వహించారు. గత ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత పురుషుల కబడ్డీ జట్టులో 30 ఏళ్ల సహ్రావత్ సభ్యుడు.

అట్టహాసంగా ప్రారంభమైన ఆసియా క్రీడలు..

20వ ఆసియా క్రీడలు జపాన్‌లో నగోయా నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఈ క్రీడలు జరగనున్నాయి. 45 దేశాల క్రీడాకారులు ఈ గేమ్స్‌లో పాల్గొంటున్నారు. భారత్ నుంచి 30కిపైగా క్రీడల్లో 503 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2022లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో పతకాల పట్టికలో 28 బంగారు పతకాలతో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తంగా 106 మెడల్స్‌ను సొంతం చేసుకుంది.

## డబ్ల్యూఏపీఎల్.. అమరావతి ఈ ఛాంపియన్స్‌దే విజయం

తొలిసారి జరుగుతోన్న మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్‌లో అమరావతి ఈ ఛాంపియన్స్ శుభారంభం చేసింది. తన మొదటి మ్యాచ్‌లోనే వైజాగ్ ఫైర్ బర్డ్స్‌పై 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గిన వైజాగ్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత అమరావతి ఈ ఛాంపియన్స్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఓపెనర్ రంగ లక్ష్మి (102) అద్భుతమైన శతకం సాధించింది. దీక్ష (43) రాణించింది. అనంతరం లక్ష్య ఛేదనలో వైజాగ్ 146/6 స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో పుష్పలత (60) హాఫ్ సెంచరీ నమోదు చేసింది. అయేషా సింగ్ (35*), శర్వాణి (24) ఫర్వాలేదనిపించారు. అమరావతి బౌలర్లలో దేవిక 2.. విష్ణుప్రియ, తరిణి జోషి, పూజిత తలో వికెట్ తీశారు.

**రంగ లక్ష్మి అరుదైన ఘనత**

మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్‌లో రంగ లక్ష్మి (Ranga Lakshmi) అరుదైన ఘనత సాధించింది. ఈ లీగ్‌లో తొలి సెంచరీ చేసిన బ్యాటర్‌గా రంగ లక్ష్మి నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకుంది. ఓ వైపు కెప్టెన్ నీరగట్టు అనూష (10) త్వరగానే పెవిలియన్‌కు చేరినా మరో ఎండ్‌లో రంగ లక్ష్మి మాత్రం పట్టు వదల్లేదు. బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో 71 బంతుల్లో శతకం పూర్తి చేసింది. దీక్షతో కలిసి రెండో వికెట్‌కు 90 పరుగులు జోడించింది. అయితే, స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ పెవిలియన్‌కు చేరడంతో ఆఖర్లో స్కోరు బోర్డు వేగం తగ్గింది. వైజాగ్ బౌలర్లలో శర్వాణి, రిషిక, శరణ్య తలో వికెట్ తీశారు.

**అంతకుముందు తొలి మ్యాచ్‌లో..**

డబ్ల్యూఏపీఎల్ తొలి మ్యాచ్ గోదావరి గోల్డెన్ ఈగల్స్ రాయలసీమ జెన్ స్టార్స్ మధ్య జరిగింది. గోదావరిపై రాయలసీమ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గోదావరి జట్టు 116 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన రాయలసీమ టీమ్ 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఛేధించింది. శుభ శ్రీ 23, సేతు సాయి 33, పద్మజ 30* రన్స్ చేశారు. గోదావరి బౌలర్లలో హారిక, పెరైరా, విన్నీ సుజన్ తలో వికెట్ తీశారు.



## సెమీస్‌లో ఓటమి.. అయినా మరో అవకాశం!

ఆసియా క్రీడలు 2026లో భారత టెక్‌బాల్ స్టార్ క్వీమీ డిసౌజాకు చేదు అనుభవం ఎదురైంది.

మహిళల సింగిల్స్‌లో ఆది నుంచి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈ ముంబైకర్ సెమీ ఫైనల్లో మాత్రం ఓటమిపాలైంది. ఇండోనేషియాకు చెందిన ఇమా సుమయతో సెమీస్‌లో తలపడ్డ క్వీమీ తొలి సెట్‌ను 127తో గెలుచుకుంది. అయితే, సుమయ అనూహ్య రీతిలో పుంజుకుని రెండో సెట్‌ను 129తో సొంతం చేసుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో పట్టువదలని సుమయ 127తో క్వీమీపై పైచేయి సాధించింది.

ఫలితంగా సుమయా ఫైనల్‌కు అర్హత సాధించింది. అయితే, సెమీస్‌లో ఓడినప్పటికీ క్వీమీకి పతకం గెలిచేందుకు మరో అవకాశం ఉంది. ఆదివారం జరిగే కాంస్య పతక పోరులో ఆమె జపాన్‌కు చెందిన యియునా సకామొటోతో అమీతుమీ తేల్చుకుంటుంది. ఎవరీ క్వీమీ డిసౌజా?ముంబైకి చెందిన క్వీమీ పదమూడేళ్ల వయసులో మిడిల్ డిస్టాన్స్ రన్నర్‌గా తన క్రీడా ప్రయాణం మొదలుపెట్టింది. ఆ తర్వాత ఫుట్‌బాల్‌పై మక్కువ పెంచుకున్న 24 ఏళ్ల ఈ అమ్మాయి ఏజ్ గ్రూప్‌లో మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించింది.

అయితే, ఆశించిన రీతిలో కెరీర్ కొనసాగే పరిస్థితి లేకపోవడంతో క్వీమీ.. చదువు మీద శ్రద్ధ పెట్టింది. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేసి.. క్రీడా వస్తువుల రీటైలర్ డెకథ్లాన్‌లో ఉద్యోగంలో చేరింది. అక్కడే ఆమెకు టెక్‌బాల్ పరిచయమైంది. బ్రెజిల్ ఫుట్‌బాల్ దిగ్గజం రినాల్డిన్హో ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో టెక్‌బాల్ ఆటను వీక్షించిన క్వీమీకి ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలో కఠోర శ్రమతో క్రమక్రమంగా భారత టెక్‌బాల్ స్టార్‌గా ఎదిగింది. అంతర్జాతీయ స్థాయిలో టెక్‌బాల్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళా టెకర్‌గా నిలిచింది. ఏడుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన క్వీమీ.. బెంగళూరులో టెక్‌బాల్ క్లబ్ స్థాపించి.. క్రీడను ప్రోత్సహిస్తోంది. ఇటీవల రొమేనియాలో జరిగిన టెక్‌బాల్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో క్వీమీ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఇక తాజాగా ఆసియా క్రీడల్లో మహిళల సింగిల్స్‌లో గ్రూప్‌ఎ నుంచి తలపడ్డ క్వీమీ.. తొలుత జపాన్ టెకర్ యియునా సకామొటోపై 21తో గెలిచింది. ఆ తర్వాత కాంబోడియా టెకర్ కొయెమైయన్‌ను ఓడించింది. ఈ క్రమంలో గ్రూప్‌ఎ టాపర్‌గా నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. అయితే, సెమీస్‌లో మాత్రం ఓటమి ఎదురైనప్పటికీ.. కాంస్య పతక పోరులో నిలవగలిగింది.

ఏమిటీ టెక్‌బాల్?ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌ల కలయికే ఈ గేమ్. వాలుగా ఉన్న టేబుల్ పైనున్న నెట్ మీదుగా.. ఆటగాళ్లు తమ పాదాలు, కాళ్లు, ఛాతీ, తలతో ఫుట్‌బాల్‌ను కొడుతుంటారు. చేతులు, భుజాలు కాకుండా శరీరంలోని ఏ భాగంతోనైనా ఫుట్‌బాల్‌ను హిట్ చేయొచ్చు. సింగిల్స్, డబుల్స్ ఫార్మాట్లలో దీనిని నిర్వహిస్తారు. హంగేరీలో 2014లో ఈ క్రీడను కనుగొన్నారు.



## మళ్లీ పట్టాలెక్కనున్న ‘ది ఇంటర్న్’ రీమేక్

అమితాబ్ బచ్చన్, దీపికా పడుకోన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కనున్న ‘ది ఇంటర్న్’ హిందీ రీమేక్ మళ్లీ పట్టాలెక్కనుంది. అమెరికన్ కామెడీ డ్రామాకు రీమేక్‌గా ఈ చిత్రాన్ని రూపొందించేందుకు గత ఐదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలోనే అమితాబ్, దీపిక ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు ప్రకటన వచ్చినప్పటికీ, అనివార్య కారణాలతో ప్రాజెక్ట్ నిలిచిపోయింది. తాజాగా ఈ సినిమాను తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నాలు మొదలైనట్లు సమాచారం. అమిత్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ‘పీకూ’ తర్వాత అమితాబ్ బచ్చన్, దీపికా పడుకోన్ మరోసారి కలిసి నటించనుండటంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరుగుతోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. హాలీవుడ్ చిత్రాన్ని యథాతథంగా తెరకెక్కించకుండా భారతీయ నేపథ్యానికి అనుగుణంగా కథలో పలు మార్పులు చేయనున్నట్లు దర్శకుడు ఇప్పటికే వెల్లడించారు. ఈ చిత్రాన్ని దీపికా పడుకోన్ స్వయంగా నిర్మించనున్నట్లు సమాచారం. దీంతో నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా ఆమె మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఓ యువ వ్యాపారవేత్త ఫ్యాషన్ సంస్థను నడిపించే క్రమంలో ఎదుర్కొనే సవాళ్లు, అదే సంస్థలో 70 ఏళ్ల రిటైర్డ్ వ్యక్తి సీనియర్ ఇంటర్న్‌గా చేరిన తర్వాత వారిద్దరి మధ్య ఏర్పడే వృత్తిపరమైన అనుబంధం, మానవ సంబంధాల నేపథ్యంలో ‘ది ఇంటర్న్’ కథ సాగుతుంది. హిందీ రీమేక్‌లో ఈ కథను భారతీయ పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా మలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# అందం అంటే ఆరోగ్యమే

ప్రసవానంతరం పెరిగిన బరువుపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలు, శరీరాకృతిపై జరుగుతున్న వ్యాఖ్యలపై బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ స్పందించారు. తన దృష్టిలో నిజమైన అందం అంటే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటమేనని స్పష్టం చేశారు. కెరీర్ ప్రారంభంలో అందానికి సంబంధించిన కఠినమైన ప్రమాణాలను పాటించినప్పటికీ, కాలక్రమేణా తన ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చిందని తెలిపారు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడంతో పాటు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని కత్రినా పేర్కొన్నారు. బయట కనిపించే రూపం కంటే వ్యక్తిలో ఉండే ఆత్మవిశ్వాసమే అసలైన సౌందర్యమని అభిప్రాయపడ్డారు. అందం విషయంలో ఇతరులు నిర్ణయించే ప్రమాణాల కంటే, మన గురించి మనం ఎలా భావిస్తున్నామన్నదే ముఖ్యమని చెప్పారు. ఇదిలా ఉండగా, కత్రినాపై జరుగుతున్న ట్రోలింగ్, బాడీ షేమింగ్ వ్యాఖ్యలను పలువురు సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ కూడా దీనిపై స్పందించారు. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో హార్మోన్ల మార్పులు చోటుచేసుకోవడం సహజమైన ప్రక్రియ అని ఆమె పేర్కొన్నారు. మహిళల శారీరక మార్పులను అర్థం చేసుకోకుండా హేళన చేయడం సరికాదని ఖుష్బూ అన్నారు. తాను కూడా గతంలో ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. ఇతరుల వ్యాఖ్యలను పట్టించుకోకుండా మహిళలు తమను తాము ప్రేమించుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడమే బాడీ షేమింగ్‌కు సరైన సమాధానమని ఆమె పేర్కొన్నారు.



## ‘వెట్టువం’ కోసం శోభిత కఠిన శిక్షణ

అక్కినేని నాగ చైతన్య భార్య, నటి శోభిత ధూళిపాళ్ల ప్రస్తుతం దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న ‘వెట్టువం’ సినిమాలో శారీరకంగా ఎంతో కఠినమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆమె చూపిస్తున్న అంకితభావాన్ని దర్శకుడు ప్రత్యేకంగా ప్రశంసించారు. శోభిత అద్భుతమైన నటి అని పేర్కొన్న ఆయన.. ఆమెతో చాలా కాలంగా కలిసి పనిచేయాలని అనుకుంటున్నానని తెలిపారు. సినిమాలోని యాక్షన్ సన్నివేశాల్లో శోభిత ఒక్క షాట్‌కు కూడా డూప్‌ను ఉపయోగించలేదని పా. రంజిత్ వెల్లడించారు. కెమెరా రిహార్సల్స్ సమయంలో మాత్రమే స్టంట్ డబుల్స్ ఉండేవారని, తుది చిత్రీకరణలో మాత్రం శోభిత స్వయంగా అన్ని సన్నివేశాలను చేసేవారని చెప్పారు. పాత్రలో సహజత్వం రావాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఆమె తన వంద శాతం కష్టపడ్డారని రంజిత్ తెలిపారు. మరోవైపు, ‘వెట్టువం’ కోసం తాను ఎంతో కష్టపడుతున్నట్లు శోభిత కూడా వెల్లడించారు. సినిమాలోని కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేయడానికి 15 నుంచి 20 ఏళ్ల శిక్షణ అవసరమయ్యేంత క్లిష్టంగా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ ప్రతి షూటింగ్ రోజూ ఉత్సాహంతో, బృందంగా కలిసి స్టంట్స్ పూర్తి చేస్తున్నామని తెలిపారు. దర్శకుడి ప్రశంసలు, శోభిత చెప్పిన విషయాలను బట్టి ‘వెట్టువం’లో తన పాత్రను సహజంగా, బలంగా తెరపైకి తీసుకురావడానికి ఆమె తీవ్రంగా శ్రమిస్తున్నట్లు స్పష్టమవుతోంది.






## సిద్ధార్థ్‌పై తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా దాదాపు రెండు దశాబ్దాలుగా దక్షిణాది, హిందీ చిత్రాల్లో నటిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె.. సిద్ధార్థ్ మల్హోత్రా కథానాయకుడిగా నటిస్తున్న ‘ది వ్యాన్’ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం తాజాగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తన సహనటుడు సిద్ధార్థ్ మల్హోత్రాపై తమన్నా ప్రశంసలు కురిపించారు. తన సినీ ప్రయాణంలో ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి పనిచేశానని చెప్పిన ఆమె.. సిద్ధార్థ్‌లాంటి అందమైన నటుడిని ఇంతవరకు చూడలేదని అన్నారు. ‘అందగాడు’ అనే పదానికి సిద్ధార్థ్ నిలువెత్తు రూపమని ఆమె చేసిన వ్యాఖ్యలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు, సినిమాలో తమన్నా, సిద్ధార్థ్ మధ్య కనిపించే జోడీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ఈ చిత్రంలో బిహారీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఛఠ్ పూజ నేపథ్యంలో ఓ ప్రత్యేకమైన పాటను తెరకెక్కించారు. ఈ పాట గురించి మాట్లాడుతున్న సమయంలో తమన్నా తన వ్యక్తిగత అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ముంబయిలో పుట్టి పెరిగిన తనకు జుహూ బీచ్‌లో వేలాది మంది మహిళలు ఛఠ్ పూజ నిర్వహించడం చాలాసార్లు కనిపించేదని తమన్నా తెలిపారు. అయితే ఆ పూజ వెనుక ఉన్న సంప్రదాయాలు, భక్తి, ఆచారాల గురించి సినిమా చిత్రీకరణ సమయంలోనే మరింతగా తెలుసుకున్నానని చెప్పారు. ఛఠ్ పూజలో మహిళలు సుమారు 36 గంటల పాటు నీరు కూడా తీసుకోకుండా కఠినమైన నియమాలను పాటించడం తనను ఆశ్చర్యపరిచిందని పేర్కొన్నారు. బిహారీ సంస్కృతిలో ఛఠ్ పూజకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని తమన్నా అన్నారు. సాధారణంగా ఉదయించే సూర్యుడికి పూజలు చేయడం చూస్తుంటామని.. అయితే ఈ పూజలో అస్తమించే సూర్యుడికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం తనను ఆకట్టుకుందని చెప్పారు. పాట చిత్రీకరణ సమయంలో తనకు ఒక ప్రత్యేకమైన అనుభూతి కలిగిందని, తనలోకి ఏదో తెలియని దివ్యమైన శక్తి ప్రవేశించినట్టుగా అనిపించిందని తమన్నా వెల్లడించారు.



## పీరియడ్స్‌పై శ్రుతి హాసన్ సంచలన వ్యాఖ్యలు

నటి, గాయని శ్రుతి హాసన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ విషయాన్ని తాజాగా బహిరంగంగా వెల్లడించారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. పీరియడ్స్ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పంచుకున్నారు. చిన్నప్పటి నుంచే తీవ్ర నొప్పితో బాధపడేదానినని, కొన్ని సందర్భాల్లో వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితులు ఎదురయ్యేవని తెలిపారు. సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందని శ్రుతి చెప్పారు. షూటింగ్‌ల సమయంలో, ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నప్పుడు తీవ్రమైన కడుపునొప్పి ఉన్నప్పటికీ ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయేదానినని తెలిపారు. తన సమస్యను చెప్పడం కంటే దాచుకోవడమే మంచిదని అప్పట్లో భావించేదానినని, దాంతో తాను ఎందుకు నీరసంగా కనిపిస్తున్నానో చుట్టుపక్కల వారికి అర్థం కాకపోయేదని చెప్పారు. అయితే తనతో కలిసి పనిచేసిన ఓ కళాకారుడికి శస్త్రచికిత్స జరిగిన సమయంలో చిత్రబృందం అతనికి అవసరమైన సహాయం చేయడం చూసిన తర్వాత తన ఆలోచన మారిందని శ్రుతి తెలిపారు. తన సమస్యను కూడా చిత్రబృందానికి చెబితే వారు అర్థం చేసుకుంటారనే నమ్మకం కలిగిందని చెప్పారు. ఆ తర్వాత ఓ దర్శకుడితో పీరియడ్స్ సమస్య గురించి చెప్పగా ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని, ఆయనకు కుమార్తె ఉండటంతో తనకు మరింత ధైర్యం వచ్చిందని వెల్లడించారు. అప్పటి నుంచి అవసరమైనప్పుడు తన సమస్య గురించి బహిరంగంగా చెప్పడం ప్రారంభించానని శ్రుతి పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ఆమె మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు. అలా జరిగితే హీరోయిన్ల ఒప్పందాల్లో పీరియడ్స్‌కు సంబంధించిన సెలవులను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించేవారేమో అంటూ చమత్కరించారు. శ్రుతి హాసన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com